ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 13 మార్చి , 2026 | పేజీలు : 06




ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎం) : బోడుప్పల్‌లోని అక్షరా కన్వెన్షన్‌లో గురువారం మండలానికి చెందిన సిపిఐ నాయకులు పంజాల చంద్రమౌళి కుమారుడు మనోజ్ కుమార్ వివాహానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, వీరితోపాటు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ పాల్గొని నూతన దంపతులకు ఆశీర్వదించారు.

# నల్లగొండ జిల్లాలో గృహ ఎల్‌పిజి గ్యాస్ కొరత లేదు

## కలెక్టర్ చంద్రశేఖర్

ప్రజాపక్షం/నల్లగొండ : పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో గ్యాస్ ఏజెన్సీలు,పౌరసరఫరాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.గృహ గ్యాస్‌ను కమర్షియల్‌గా వినియోగిస్తున్న 16 మందిపై నిత్యావసరాల చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.ప్రజలు ఆం దోళన చెందకుండా అవసరమైనప్పుడు మాత్రమే గ్యాస్ బుక్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్యాస్ సరఫరాకు సంబంధించి సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800425 1442 లేదా వాట్సా ప్ నెంబర్ 6305951279 కు తెలియజేయాలని కోరారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్,వై.అశోక్ రెడ్డి,డిఎస్ఓ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



**68 అక్రమంగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు సీజ్ :** జిల్లాలో సివిల్ సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు,టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి నల్లగొండ పట్టణం,మల్లేపల్లి ప్రాంతాల్లో అక్రమంగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్న హోటళ్లు, ధాబాలు, రిఫిల్లింగ్ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు.మల్లేపల్లి గ్రామ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 60 డొమెస్టిక్ సిలిండర్లు సీజ్ చేసి సంబంధిత వారిపై 6ఏ కేసులు నమోదు చేశారు. అదేవిధంగాపట్టణంలోని ప్రసాద్ ఉడిపి హోటల్,నందిని హోటల్, క్రితంగ హోటల్, మల్లేపల్లి టౌన్‌లోని నేహ హోటల్,సాయినందిని హోటల్, తేజస్విన్ వాటర్ ప్లాంట్ తదితర ప్రదేశాల్లో దాడులు నిర్వహించి మొత్తం 68 సిలిండర్లు సీజ్ చేసి సంబంధిత వారిపై 6ఏకేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

# కౌన్సిలర్ ధనలక్ష్మికి ఘన సన్మానం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియూ)జిల్లా కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చండూరు మున్సిపాలిటీలో సిపిఐ కౌన్సిలర్‌గా ఎన్నికైన జల్లా ధనలక్ష్మి శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,నల్లగొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఆమెకు శాలువా కప్పి సత్కరించారు మహిళలు రాజకీయాలు సహా అన్ని రంగాల్లో ముందుకు వచ్చి సమాజాభివృద్ధికి కృషి చేయాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో మహిళ ఉపాధ్యక్షురాలు జి.ఉదయరాణి,ఎంఈఓ కత్తుల అరుంధతి, ఎస్‌టియూ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తండు భాను ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మురారి శెట్టి రమేష్,పూర్వ అధ్యక్షుడు కొనకంచి వీరరాఘవులు, అసోసియేట్ అధ్యక్షుడు కె. దత్తేశ్వర్ పాల్గొన్నారు.



# పురపాలక పనుల ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ పురపాలక పరిధిలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం, అమృత్ నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పురపాలక శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ భాస్కర్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజారోగ్య శాఖ ఎస్‌ఈ కందుకూరు వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పట్టణంలో ఆకస్మికంగా పర్యటించారు. తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీ సమీపంలో నిర్మాణంలో ఉన్న భూగర్భ డ్రైనేజీ వ్యర్థపు నీటి శుద్ధి ప్లాంట్1, రాంనగర్ బంధం డంపింగ్‌యార్డు పక్కన ఉన్న భూగర్భ డ్రైనేజీ వ్యర్థపు నీటి శుద్ధి ప్లాంట్ 2 పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, నీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం గురించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మాణంలో ఉన్న ఉపరితల నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యత లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు స్థానిక అధికారులు నిర్మాణ పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజారోగ్య శాఖ ఎస్‌ఈ కందుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేసి ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాళ్లగడ్డ వద్ద అదనంగా మరో శుద్ధి ప్లాంట్‌ను నిర్మాణం చేపడ్తామన్నారు. పురపాలిక డీఈ వెంకన్న, ఏఈలు నవీన్, అంజలి, ప్రజారోగ్య శాఖ ఏఈ సాయితేజ ఉన్నారు.



# నియోజకవర్గ అభివృద్ధికి కృషి

## దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

ప్రజాపక్షం/చింతపల్లి : దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల పరిధిలోని దేన్యతాండా, బోత్యతాండా, బాలాజీ తాండా, ధ్రైర్యపురితాండాలో ఎన్ఆర్‌జిఎస్ నిధులతో నూతనంగా నిర్మించుకున్న మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి బాలునాయక్ గురువారం శంకుస్థాపన చేశారు. నెల్వపల్లి గ్రామం నుండి మల్లపురాజుపల్లి వరకు రూ. 4 కోట్ల 75 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గొడ్డటి మల్లమ్మ రాములు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా బాలాజీ తాండా, చింతపల్లి గ్రామాలలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బాలునాయక్ శంకుస్థాపన చేశారు. తదనంతరం శ్రీ గట్టు లక్ష్మి మైసమ్మ మాత దేవాలయాన్ని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. కుర్మేడు గ్రామంలో గణపతి, సురమంబకంఠమహేశ్వర, రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, ఈ భవనాల ద్వారా మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు , ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు మహిళ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఫోటో ఎగ్జిబిషన్‌ను వీక్షించిన కలెక్టర్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో డిపిఆర్ఓ వల్లోజి శ్రీనివాసరావు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే విధంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వీక్షించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను ఆయన పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి అవగాహన కల్పించేలా ఈ ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌ను ఏర్పాట్లలో సీనియర్ అసిస్టెంట్ పి. సుధాకర్, రికార్డు అసిస్టెంట్ అనిల్ కుమార్, సిబ్బంది రహీం, అశోక్, నరేష్‌లు పాల్గొనగా, ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, జడ్పి సీఈఓ శిరీష పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాపక్షం/గరిడేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండల కేంద్రం లోని గుండాలమ్మ మిట్ట గుడి వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎపి39 టిసి3979 నెంబర్ గల లారి రాజమండ్రి నుండి పడవ ఎత్తుకుని సుంకిశాల డ్యామ్ వద్ద దింప డానికి తీసుకుని వెళ్తుండగా మండల కేంద్రంలోని గుండాలమ్మ మిట్ట గుడి వద్ద పడవ రోడ్డు మధ్యలోని సెంట్రల్ లైటింగ్ పోల్‌కు తగలగా ఈ ప్రమాదంలో అటుగా బైక్‌పై వెళ్తున్న పాలకవీడు మండలం బెట్టా తండా గ్రామానికి చెందిన మాలవత్ లక్ష్మా (30)త లపై పడి తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికుల సహా యంతో పోలీసులు హుజూర్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

## డిగ్రీ కళాశాలలో ఎకో బజార్



ప్రజాపక్షం/రామన్నపేట : ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట నందు గురువారం ఏకో బజార్ యాక్టివి టీలో భాగంగా మట్టితో విగ్రహాలు, సీడ్ బాల్స్‌ని విద్యా ర్థులతో తయారు చేయించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు యాక్టివిటీస్ ద్వారా పర్యావరణ సమతుల్య ప్రాముఖ్యాన్ని మరియు అడవుల పెంపకం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీలిమ, డాక్టర్ కిషన్, డాక్టర్ కృష్ణ కొండిన్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సునీత, అనిత, డాక్టర్ రవీంద్రరావు, డాక్టర్ రాచమల్ల శ్రీను, టి.శ్రీనివాసులు, అమర్, నరేష్, ఆంజ నేయులు, రాధిక, రవి తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దుస్తులు పంపిణీ



ప్రజాపక్షం/మునగాల: స్వాతంత్ర్య సమరయోధుడు చిల్లంచర్ల రఘునాథం సతీమణి వరలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు గురువారం మండల కేంద్రం లోని శ్రీసాయి గాయత్రి పాఠశాలలో పేద విద్యార్థు లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిల్లంచర్ల వరలక్ష్మి కుటుంబ సభ్యులు, పాఠశాల ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ

ప్రజాపక్షం/కోదాడ రూరల్ : సూర్యాపేట జిల్లా కలె క్టర్ తేజస్ నందలాల్ పవార్ తన స్వంత నిధులతో పదవ తరగతి విద్యార్థులకు బహుకరించిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, కంబాక్స్, స్కేల్, పెన్సిల్‌లను హాల్ టికెట్‌తో పాటు తదితర వస్తువులను విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు గుగులోతు మోతిలాల్ అందజే శారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సిఎం గారూ...! జవాబు చెప్పకుండా అడుగు పెట్టొద్దు

**సిఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లం**

ప్రజాపక్షం/కోదాడ: కోదాడ పట్టణానికి చెందిన దళిత బిడ్డ కర్ల రాజేష్‌ను చిత్ర హింసలకు గురిచేసి చంపిన పోలీస్ అధికారులను సస్పెండ్ చేయలేదని, దీనికి జవాబు చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హుజూర్‌నగర్‌లో అడుగు పెడితే శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో అడ్డుకుంటామని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తీవ్రస్థా యిలో హెచ్చరించారు. బుధవారం కోదాడలో ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరిట ఓ బహి రంగ లేఖ విడుదల చేశారు. హుజూర్‌నగర్ పర్యట నలో పాల్గొనే ముందు తాము లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. తనపై వ్యక్తిగత కక్షతో దళిత బిడ్డను హత్య చేశారని, దాని వెనుక మంత్రి ఉత్తమ్ దంపతుల ప్రమేయం ఉందని సాక్షాత్తు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధారాలతో సహా నిరూపించినప్పటికీ ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదో సమా ధానం చెప్పాలన్నారు. మంత్రులను కాపాడుకోవడం కోసం దళిత బిడ్డ ప్రాణాలను ఫణంగా పెట్టారని ఆవే దన వ్యక్తం చేశారు. రాజేష్ కుటుంబానికి న్యాయం జరగని పక్షంలో14న ముఖ్యమంత్రి కాన్వాయ్‌ను ముందుకు కదలనివ్వమని బొల్లం మల్లయ్యయాదవ్ హెచ్చరించారు.

## అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులో....

ప్రజాపక్షం/కోదాడ: తీవ్రమైన గుండె జబ్బుతో పాటు దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న 61 ఏళ్ల మహిళకు మలక్‌పేట యశోధ ఆసుపత్రిలో అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడినట్లు ప్రముఖ గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ వెంగల్‌రెడ్డి తెలిపారు. గురువారం కోదాడ పబ్లిక్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. ప్రధాన రక్తనాళాల్లో అడ్డంకులు ఉండటం, షుగర్, బిపి వంటి సమస్యల వల్ల ఈ కేసు అత్యంత ప్రమాదకరంగా మారింద న్నారు. గుండెను ఆపకుండా నిర్వహించే ఆఫ్ పంప్ పద్ధతిలో బైపాస్ శస్త్రచికిత్స చేసి రోగిని ప్రాణా పాయం నుంచి రక్షించామన్నారు. శస్త్రచికిత్స జరి గిన రోజే వెంటిలేటర్ తొలగించామని, ప్రస్తుతం




ఆమె పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని వివరించారు. అత్యాధునిక, సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో ఎంతటి క్లిష్టమైన కేసులనైనా విజయవం తంగా పూర్తి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజ లందరు అన్ని రకాల వసతులు, వైద్య బృందం ఉన్న ఆసుపత్రులలో చికిత్స చేసుకోవాలన్నారు. ఈకార్యక్ర మంలో డిజిఎం లక్ష్మణ్, శ్రీకాంత్, సీనియర్ మేనే జర్ వాసు కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## పబ్లిక్ టాయిలెట్ నిర్మాణంపై స్థానికుల అభ్యంతరం



ప్రజాపక్షం/కోదాడ: కోదాడ పట్టణంలోని 25వ వార్డు చేపల మార్కెట్ సమీపంలో పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ ప్రతిపాదనపై వార్డు కౌన్సిలర్, స్థానికులు మండిపడుతున్నారు. గత పదేళ్లుగా వినియోగంలేని పాత టాయిలెట్‌ను కూల్చివేసిన అధికారులు, అదే స్థలంలో మళ్లీ కొత్తగా నిర్మించాలని చూడటం సరికా దన్నారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు, మద్యం సేవించడం వంటివి సాగుతున్నాయని అన్నారు. ఇరుకైన గల్లీ కావడంతో వర్షం వస్తే నీరు నిలిచివాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపా లిటి నుండి బస్టాండ్ వరకు టాయిలెట్లు అందుబా టులో ఉన్నాయని ఆవే వాడకంలో లేవని వార్డులో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయమంటే నిధులు లేవని చెప్పే కమిషనర్ ప్రజలకు ఉపయోగ దని చోట నిధులు ఖర్చు చేయడం దుర్వినియోగమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ బాబా, తాబుసం, జంపాల భద్రయ్య, భూలక్ష్మి, రామకృష్ణ, శ్రీనివాసరావు, మజీద్, ముత్యాలరావు, జాన్‌బీ పాల్గొన్నారు.

## డీలర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : కొత్త రేషన్ దుకాణాల డీలర్ల కోసం అర్హులైన స్థానికులు దర ఖాస్తు చేసుకోవాలని ఆర్‌డిఓ ఆర్ వేణుమాధవరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌డిఓ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గాల్లోని 9 మండలాల్లో కొత్త రేషన్ దుకాణాలు ఉన్నట్లు వివరించారు. ఆత్మకూర్(ఎస్) మండలంలో (2) గట్టికల్లు, శెట్టిగూడెం, చివ్వెంల మండలంలో (2) చంద్లపట్ల, వాల్యాతండ, జాజిరెడ్డిగూడెం మండ లంలో (1) కొమ్మాల, మోతె మండలంలో (2) నర సింహాపురం, తుమ్మగూడెం, నాగారం మండలంలో (1) వర్ధమానుకోట, నూతనకల్ మండలంలో (1) ఎడవెల్లి, సూర్యాపేట మండలంలో (3) ఇమాంపేట, సూర్యాపేట పట్టణం, తాళ్ళకాంపాడు గ్రామం, తిరు మలగిరి మండలంలో (2) మాలిపురం, తిరుమల గిరి, తుంగతుర్తి మండలంలో (1) రావులపల్లి గ్రా మం ఖాళీగా ఉన్న 15 కొత్త రేషన్ దుకాణాలకు రేష న్ డీలర్లు ఈనెల 16 నుండి ఏప్రిల్ 14 వరకు పదవ తరగతి పాస్‌అయి, తమ కుల ధృవీకరణ సర్టిఫికెట్, 18 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల లోపు ఉన్నవాళ్లందరూ అప్లై చేసుకోవాలని తెలిపారు.

## సుధా బ్యాంక్‌కు 5 స్టార్ క్వాలిటీ రేటింగ్ పురస్కారం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సుధా బ్యాంక్ అత్యుత్తమ నిర్వహణ, పనితీరు ఆధారంగా అంతర్జా తీయ హై క్వాలిటీ హైమ్ (హెచ్‌వైఎం) రేటింగ్ సంస్థ 5 స్టార్ రేటింగ్ పురస్కారం ప్రకటించింది. ఈ పుర స్కారాన్ని నేడు (శుక్రవారం) ఉదయం 11 గంట లకు త్రివేణి గార్డెన్స్‌లో సంస్థ ప్రతినిధులు ఈ పుర స్కారాన్ని సుధా బ్యాంక్‌కు అందజేయనున్నట్లు సుధా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ తెలి




పారు. బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఐఏఎస్ ట్రైనర్ ఆకెళ్ల రాఘ వేంద్ర విచ్చేస్తున్నట్లు చెప్పారు.



## పరీక్షలను విద్యార్థులు పండుగలా భావించాలి

ప్రజాపక్షం/మునగాల: పరీక్షలను విద్యార్థులు పండుగలా భావించి, ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని మునగాల తహసిల్దార్ సరిత అన్నారు. గురు వారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదం డ్రుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులకు సమకూర్చిన పరీక్షల కిట్లను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఎటువంటి మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రతి విద్యార్థి పరీక్షలు రాసి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్యగౌడ్, రిటైర్డ్ ఎంఈవో ఒరుగంటి రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లపాటి శ్రీనివాస రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



ప్రజాపక్షం/మునగాల: విద్యార్థులు కష్టపడి చదివి పదవ తరగ తిలో మంచి మార్కులు సాధించాలని బేతెస్థ ఫౌండేషన్ మ్యానే జింగ్ ట్రస్టీ దుర్గం కరుణశ్రీ ప్రభాకర్ అన్నారు. గురువారం మం డల కేంద్రంలోని ట్రినిటి హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్, స్కేల్స్, ఏరేజార్స్, శాప్‌నర్స్‌ను అందిం చారు. ఈ సందర్భంగా బేతెస్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాసి 10కి 10శాతం మార్కులు సాధించాలని, ట్రినిటి హైస్కూల్ పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకరావాలని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరాలంటే పదవ తరగతి మార్కులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల కరస్పాండెంట్ ముల్లంగి వనజ, ప్రిన్సిపాల్ డాక్టర్ ముల్లంగి జాకబ్‌రాజ్, పాల్వాయి అజయ్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి నూతనకల్ హైస్కూల్ విద్యార్థి ఎంపిక




ప్రజాపక్షం/నూతనకల్ : ఐక్యరాజ్యసమితికి సంబంధించిన కార్య కలాపాలపై విద్యార్థులకు అవగాహన పై బుధవారం సూర్యాపే టలో జరిగిన తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్ సెలక్షన్‌లో పిఎంశ్రీ నూతనకల్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి గంట సాత్విక్ జర్మనీ దేశ పర్యావరణం ఇబ్బందుల గురించి ఉపన్యసించి రాష్ట్రస్థా యికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రాములు నాయక్ తెలిపారు. ఈ సెలక్షన్‌లో 24 పాఠశాలల నుండి 48 మంది విద్యార్థులు పాల్గొనగా మూడవ స్థానంలో నిలిచి రాష్ట్రస్థా యికి ఎంపికయ్యారన్నారు. సాత్విక్‌కు సూర్యాపేట విద్యాశాఖ అధి కారి అశోక్ అవార్డు అందజేసినట్లు చెప్పారు. అవార్డు సాధించిన సాత్విక్‌ని సోషల్ టీచర్స్ ముంతాజ్‌ఖాను, ఉమేష్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు అభినందించారు.

## మురికికాలువల శుభ్రతకు చర్యలు

ప్రజాపక్షం/నకిరేకల్: పట్టణంలో ప్రజాపాలప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మురికికాలువల శుభ్రత పనులు చేపట్టారు. మురికికాలువల్లో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది సహాయంతో తొలగించి పరిశుభ్రం చేయించారు.ఈ కార్య క్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత శ్రీనివాస్,కౌన్సిలర్లు యాసారపు లక్ష్మి వెంకన్న,కందాల బిక్షం రెడ్డి, ఘర్షకోటి సైదులు తదితరులు పాల్గొన్నారు.



# కొండయ్య మృతి సిపిఐ(ఎం)కి తీరనిలోటు

**ప్రజాపక్షం/మునగాల:** నమ్మిని సిద్ధాంతం కోసం తను మోసిన ఎర్రజెండా ఆశయాల కోసం కడవరకు నిలబడ్డ నికార్సైన కమ్యూనిస్టు కామ్రేడ్ ఉయ్యాల కొండయ్య అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం మునగాల మండలం నర్సింహులగూడెం గ్రామ సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ ఉయ్యాల కొండయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి పూల మాలలువేసి జోహార్లు అర్పించిన అనంతరం జరిగిన అంతిమయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎంజిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, ముల్కలపల్లి రాములు, మట్టపల్లి సైదులు, కోట గోపి, బుర్రి శ్రీరాములు, జూలకంటి విజయలక్ష్మి, శ్రీకాంత్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# స్వపరిపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఎంపిపిఎస్ సింగారెడ్డిపాలెం పాఠశాలలో గురువారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నకిరకంటి రవి మాట్లాడుతూ సింగారెడ్డిపాలెం పాఠశాల నిర్వహణ ప్రైవేట్ స్కూళ్లకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, ఉపాధ్యాయులు నల్ల శ్రీనివాస్, సరిత, శిగ మహేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాకమిటి సభ్యులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2ల ఆధ్వర్యంలో శీతాకాల ప్రత్యేక శిబిరం 6వ రోజు మండల లోని గూడూరు, కృష్ణాపురం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామాల్లో మత్తు పదార్థాలు,మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఉత్పన్నమయ్యే దుష్ప్రభావాల గురించి ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు ఏ విధంగా దూరంగా ఉండాలో తెలియచెప్తూ అదేవిధంగా హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలి నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి, నాగరాజు, డాక్టర్ రవీందర్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, శ్రీను, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాసరావు, స్వప్న, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



# పేదలే ప్రభుత్వ ఎజెండా

## దరి చేరక పెరుగుతున్న దారిద్ర్యం



**ప్రజాపక్షం/మోతె :** పేదలే లక్ష్యంగా ప్రభుత్వం ఏజెండాతో ప్రతియేటా బడ్జెట్ రూపొందించి కేటాయింపులు చేస్తున్నారు. కానీ అవి నేటికి పేదల చెంతకు చేరకపోవడంతో రోజురోజుకు దేశంలో పెరుగుతున్న దారిద్రంకు పునాదులు వేస్తున్నారని విమర్శలు వస్తున్నప్పటికి నవ్విపోదురు గనుక నాకేంటి సిగ్గు అన్న చందంగా ప్రభుత్వాల తీరు అద్దం పడుతున్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచిన గతి తప్పుతున్న భారతదేశ పాలనను చూసిన పలు దేశాలలో మన దేశ సంపద సకల సహజ వనరులపై గొప్పలు దంచి కొడుతున్న నేతల తలరాతలు మారుతున్నాయని పల్లెలు పట్టుకొమ్మలని చెప్పిన గాంధీజీ కళలు కళ్ళలుగా మిగిలాయని నిర్వచించడంలో ఎలాంటి అనుమానం కలగక మానదు. విద్య, వైద్యం కనీస అవసరాలైన కూడు, గుడ్డ, నీడ కల్పించలేని స్థితిలో ఈ దేశంలో పాలన కొనసాగిస్తున్నారని అనేక మంది ప్రజాస్వామికవాదులు విశ్లేషణ చేస్తున్నారు. దేశం అభివృద్ధి చెందుతున్నట్లు చెపుతున్నారు. ఇంకా ఎప్పటికి అభివృద్ధి చెందుతున్నది అనేది ఒక సమస్యగా పరిగనించాలి. కానీ పారిశ్రామీకీకరణ పేరుతో లక్షల కోట్ల రూపాయలు ఉన్నత వర్గాలకు దోచిపెట్టడం, రహదారుల అభివృద్ధితో స్వంత ప్రయోజనం కోసమే అన్నట్లుగా వ్యవహారిస్తున్నట్లు పలు ప్రజాసంఘాలు దూమారం లేపుతున్నా ఏమాత్రం పట్టనట్లు వ్యవహరించడంతో ఎవరి ప్రయోజనాలు నెరవేరుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఎప్పటికి పేదల ఆశలు, ఆకాంక్షలు నెరవేరుతాయో వేచి చూడాలి మరి.

# భూసారం కాపాడేందుకు శాస్త్రీయ పద్ధతులు పాటించాలి




**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** భూసారం కాపాడేందుకు శాస్త్రీయ పద్ధతులు అవలంభించాలని సూర్యాపేట జిల్లా ఆత్మ డిప్యూటి ప్రాజెక్ట్ డైరెక్టర్ నివేదిత అన్నారు. గురువారం మండలంలోని అల్వాలపురం రైతువేదికలో డివిజన్, మండల స్థాయి వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకం ఆధ్వర్యంలో రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ (ఆర్‌పిఎల్) శిక్షణ కార్యక్రమంలో ఆమె హాజరై మాట్లాడారు. రైతులకు రసాయనిక ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల భూసారం క్షీణిస్తుందని తెలిపారు. రైతులు, శాస్త్రవేత్తలు సూచించిన విధంగా దఫాల వారీగా ఎరువులు వినియోగించాలని సూచించారు. కెవికె గడ్డిపల్లి శాస్త్రవేత్త మాట్లాడుతూ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డిఏపి ఎరువులను వినియోగించడం ద్వారా మొక్కలకు అవసరమైన నత్రజని నేరుగా పత్రాల ద్వారా అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పాలెం రజని, నియోజక ఆత్మ చైర్మన్ బుడిగం లింగయ్య, దేవప్రసాద్, నగేష్, ఝాన్సీ, వినోద్, అన్వేష్, సల్మా, రైతులు పాల్గొన్నారు.

# పది పరీక్షలకు మిర్యాలగూడలో 12 పరీక్షా కేంద్రాలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో ఈనెల 14 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు 12 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో డి.ధర్మానాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 12 కేంద్రాల్లో 2,840 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో, 8 ప్రైవేట్ పాఠశాలల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థలకు కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. వేసవికాలం కావడంతో విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయని, పరీక్ష రాసే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి 45 నిమిషాల ముందే చేరుకోవాలని ఆయన సూచించారు. ఈసారి పరీక్షా కేంద్రానికి 5నిమిషాల అనుమతి ఇవ్వడం జరిగిందని, ఉదయం 9.35గంటల అనంతరం ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబడదన్నారు. పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్‌తో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దన్నారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు ఒక డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌ను నియమించడం జరిగిందన్నారు. అదేవిధంగా 12 పరీక్షా కేంద్రాల్లో 168 ఇన్విజిలేటర్లు నియమించడం జరిగిందన్నారు.

# నాటక రంగంలో ఢిల్లీకి మిర్యాలగూడ ఖ్యాతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నాటక రంగంలో దినదినాభివృద్ధి చెందుతూ మిర్యాలగూడ ఖ్యాతి ఢిల్లీకి చేరిందని పారిశ్రామిక వేత్తలు కర్నాటి రమేష్, బండారు కుశలయ్య, గొల్ల రామశేఖర్‌లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో నాలుగవ రోజు గురువారం జాతీయస్థాయి పద్యనాటక, సాంఘీక నాటక పోటీలు, నృత్యాలను వారు జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. నాటకరంగంలో మిర్యాలగూడ ఖ్యాతి ఢిల్లీకి చేరవేయడంలో మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు, సెక్రటరీ పులి కృష్ణమూర్తిశర్మ, కోశాధికారి పుల్లాభట్ల లక్ష్మీ నారాయణశర్మల శ్రమ వెలకట్టలేనిదన్నారు. మిర్యాలగూడకు ఇంతటి ఖ్యాతిని అందించిన కళాకారులకు ఏమిచ్చినా తక్కువే అవుతుందన్నారు. నాటికల ప్రదర్శన అనంతరం నటీనటులకు, నిర్వాహకులకు పారితోషికంతోపాటు షీల్డ్, ప్రశంసపత్రాలను అందించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు, అధ్యక్షుడు రామావతరాం, కార్యదర్శి పులి కృష్ణమూర్తిశర్మ, వెంకటలక్ష్మీ నారాయణ శర్మ, సాయిలు, సత్యనారాయణచారి, లక్ష్మయ్య, ఎల్లయ్య, సత్యనారాయణ, శ్రీనివాసరావు, రాఘవయ్య, శైలజ, సరస్వతి, నాగమని, ఉపేందర్, బాబురావు, వీరప్రతాప్, రాజారం పాల్గొన్నారు.







# పేదల అభివృద్ధికి పెద్దపీట

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పేదల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వస్తుందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం దుబ్బతండా, కుంటకింది తండా నిరుపేదలకు నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు, సీసీ రోడ్లు గురువారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రభుత్వ కర్తవ్యమన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశలవారీగా అమలుపరుస్తూ ప్రజా మన్ననలను పొందుతున్నామన్నారు. ప్రజా ప్రభుత్వ పాలనలో పేదల సొంతింటి కల నెరవేరిందన్నారు. నిరుపేదలకు సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్‌కార్డులు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందన్నా. ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి




**ప్రజాపక్షం/వలిగొండ :** మండల కేంద్రంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి గోడపత్రికను ఎస్.ఐ యుగంధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత డ్రగ్స్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని అన్నారు. యువత ఆన్లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా తమ విలువైన ప్రాణాలను క్షణికావేశంలో తీసుకుంటూ కుటుంబాలకు శోకాన్ని మిగిలిస్తున్నారన్నారు. బెట్టింగులకు పాల్పడవద్దని, ఆన్లైన్ గేమ్‌కు దూరంగా ఉండాలని, తమ విలువైన జీవితాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్, మారోజు నరసింహాచారి, గుండెగాని నాగరాజ్, సలిగంజి కృష్ణ కుమార్, మెట్టు లక్ష్మణ్ నారాయణ పాల్గొన్నారు.

# మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా బిసిలకు అవకాశం ఇవ్వాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. గురువారం ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేసి మాట్లాడారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో అత్యధిక శాతం బీసీలే కౌన్సిలర్లుగా గెలిచారని, మున్సిపాలిటీలో 50శాతం బీసీలే ఓటర్లుగా ఉన్నారని, సామాజిక న్యాయం పాటించి జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా అవకాశం కల్పించాలని కోరారు. గతంలో మిర్యాలగూడ మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను బీసీలకు ఇవ్వకుండా రెండు పదవులు అగ్ర వర్ణాలకు కేటాయించారని,కనీసం ఇప్పుడైనా మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బొల్లెపల్లి స్వామిగౌడ్, మహేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

# వధూవరులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని శకుంతల ఫంక్షన్ హాల్ లో గురువారం మల్లెబోయిన వెంకన్న నాగమణి కుమారుడి వివాహం జరిగింది. ఈ సందర్భంగా టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ తన సతీమణి స్వప్నతో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించారు కాంగ్రెస్ నాయకులు గార్లపాటి రవీందర్ రెడ్డి, ఒంటెపాక నక్షత్ తదితరులున్నారు.



## యువజన రంగానికి నిధులు కేటాయించాలి

**ప్రజాపక్షం/నకిరేకల్:** రానున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో యువజన సంక్షేమానికి అధిక నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా కార్యదర్శి మల్లంమహేష్,మాట్లాడుతూ రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను దృష్టిలో ఉంచుకుని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం నాయకులు కన్నెబోయిన వీరేష్, సరికొండ శివ,దిలీప్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



**ప్రజాపక్షం/నకిరేకల్:** మండలం చందంపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో గురువారం డాక్టర్ శివాణి (ఎం.ఎల్ హెచ్ పి) బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.వాతావరణ మార్పుల వల్ల ఈ కాలంలో సీజనల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కనుకుంట్ల నవీన్ రెడ్డి,ఉపాధ్యాయులు వెల్మకంటి శ్రీహరి,ఎస్అమరలింగాచారి,సిహెచ్ వరలక్ష్మి,ఏఎన్ఎంలు లత,రేణుక తదితరులు పాల్గొన్నారు.

## వంటగ్యాస్ బుకింగ్ జరగడం లేదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ కొరత లేదంటూనే బుకింగ్ మాత్రం జరగడం లేదని, సిలిండర్‌కు రూ.68 ధర పెంచడం అన్యాయమని, సామాన్యుల పరిస్థితి ఏం కావాలని కాంగ్రెస్ నాయకురాలు గుగులోతు శారదా ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం భారతదేశం ప్రభావం లేదంటూనే గ్యాస్ బుకింగ్‌కు అవకాశం కల్పించడం లేదని ఆరోపించారు. అదేవిధంగా గతంలో 21 రోజులకు బుకింగ్ చేసుకునే అవకాశం ఉండగా 25 రోజులకు పెంచారని విమర్శించారు. మహిళలు కట్టెల పొయ్యితో కళ్లు పోగొట్టుకుంటున్నారని, గ్యాస్ వాడాలని అలవాటు చేసి నేడు ఆంక్షలు పెట్టడం ఎంతవరకు సబబు అని అన్నారు. పెంచిన ధరను వెంటనే తగ్గించాలని, ఏది ఏమైనా సామాన్యులకు వంట గ్యాస్ సిలిండర్ అందుబాటులోకి తీసుకురావాలని ఆమె కోరారు.

## మహిళల్లో ఆరోగ్య అవగాహన

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని కుదభక్షపల్లి గ్రామంలోని బేతెల్ గాస్పెల్ చర్చ్‌లో మహిళల కోసం ప్రత్యేక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్ప్రింగ్ ఫ్యామిలీ డైరెక్టర్ కిరణ్ ఆకుల,సోనీ బాడిగ జ్యోతి,మాజీ ఉపసర్పంచ్ మైలారపు పార్వతమ్మ,వార్డ్ మెంబర్ ఈరుపాక రజిత హాజరయ్యారు.ఈ సందర్భంగా కాలనీలోని మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. మహిళలు తమ సమస్యలను ధైర్యంగా చెప్పుకోవాలని,ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

# సిలిండర్లు నిల్వ చేస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** గ్యాస్ సిలిండర్లు నిల్వ చేస్తే కఠినమైన చర్యలు ఉంటాయని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్ హెచ్చరించారు. నల్గొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం పౌరసరఫరాల అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్ ఫోర్స్ అధికారులు కొండమల్లేపల్లి మండల కేంద్రంలో హోటళ్లు, రెస్టారెంట్‌లు, దాబాలు, అక్రమంగా నిలువ ఉంచి సిలిండర్లను బ్లాక్‌లో అమ్ముతున్న సాగర్ రోడ్డులోని ఒక వాటర్ ప్లాంట్‌లో తనిఖీ నిర్వహించి 60 సిలిండర్లను స్వాధీనం చేసుకొన ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. గృహాలకు ఉపయోగించే సిలిండర్లను అక్రమంగా హోటళ్లలో ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలు అనవసరంగా అవసరానికి మించి సిలిండర్లను బుక్ చేసుకోవద్దని సూచించారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరతలు ఉండవని అన్నారు. ఎవరైనా అక్రమంగా సిలిండర్లు నిల్వ చేస్తే 1967 లేదా 1800425 00333 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు. ఈ తనిఖీలలో డిటిసిఎస్‌లు ఎస్.డి. ముబీన్, దీపక్ కుమార్, ముక్తార్, జ్యోతి, సైదులు, సివిల్ సప్లై ఆర్ఐలు కుమార్‌రెడ్డి, సైదులు, టాస్క్ ఫోర్స్ అధికారి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బస్వాపురం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు, ఇండ్లు కోల్పోతున్న ప్రజలకు పూర్తిస్థాయి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాత్రి భువనగిరి మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో సిపిఎం శాఖ సమావేశం నరాల చంద్రయ్య అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ తమ భూములను, వందలాది సంవత్సరాలుగా ఒక గ్రామంలో గూడును ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న ప్రజలు ఇతరుల అవసరాల కోసం, సాగునీరు కోసం సర్వం కోల్పోతూ ప్రాజెక్టు నిర్మాణానికి సర్వము అర్పించిన నేటికీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు అన్నంపట్ల కృష్ణ, మండల కమిటీ సభ్యులు మధ్యపురం బాల్ నరసింహ, శాఖ కార్యదర్శి మచ్చ భాస్కర్, సహాయ కార్యదర్శి రాసాల దేవేందర్, సభ్యులు ఉడుత విష్ణు, ఎండి.బాబు, ఉడత వెంకటేష్, ముదిగొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో నీటి కాలువల మరమ్మతులు చేపట్టాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఉపాధి హామీ పథకం కింద నీటి కాలువల మరమ్మతులు వెంటనే చేపట్టి కూలీలకు నిరంతరం పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు.గురువారం నకిరేకల్ మండలంలోని తాటికల్లు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పనులు సరిపడా లేక కూలీలు సిఫ్టింగ్ విధానంలో పనిచేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలనుతిప్పికొట్టాలని, కూలీల హక్కుల కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆసంఘం సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన వేంకులు,మండల కార్యదర్శి సాగుకుంట్ల నరసింహ,మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య,మాజీ సర్పంచ్ ఎల్లయ్య, సంఘం నాయకులు మల్లెగొని రామకృష్ణ, బోడ మంగయ్య,వాకిటి దుర్గా,బొమ్మకంటి లక్ష్మి,ఆదిరాల మమత,సిరికొండ సైదులు, మీరుమనే మ్మ, మచ్చ పోతుల ఎల్లయ్య,మల్లెగొని రేణుక,మేడి చిన్న ఎల్లయ్య, బి.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# 80 మంది వార్డు మెంబర్లకు ఇద్దరంటే ఇద్దరే హాజరు



**ప్రజాపక్షం/చివ్వెంల :** మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 10 గ్రామ పంచాయితీలకు సంబంధించి 80 మంది వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయగా కేవలం ఇద్దరంటే ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. ఈ విషయమై అధికారులను ప్రశ్నిస్తే సమాధానం లేదు. అందరికి తాము ముందుగానే తెలియపర్చామని చెబుతున్నారు. వార్డు మెంబర్లు శిక్షణ తరగతులకు హాజరు కాకపోవడం రకరకాలుగా చర్చ జరుగుతుంది. పాలనాపరమైన శిక్షణకు 5 రోజులు కేటాయించాలని వార్డు సభ్యులు 5 సంవత్సరాల ప్రజాసమస్యల పరిష్కారానికి ఎంత చిత్తశుద్ధి ఉందో దీనిని బట్టే అర్థమవుతుంది. అధికారుల లోపమా... లేక వార్డు మెంబర్ల అలసత్వమా అన్నదానిపై పెద్దఎత్తున చర్చ సాగుతుంది. ఇదిలా ఉంటే 80 మంది సభ్యులు శిక్షణ తరగతులకు హాజరవుతున్నట్లు అధికారులు వంటావార్పు చేయడం అందరిని ఆశ్చర్యపరుస్తుంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి పంచాయితీ వార్డు మెంబర్లకు అధికారుల మధ్య ఉన్న సమన్వయ లోపం ఏమిటన్నది మండల ప్రజలు కోరుతున్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామానికి చెందిన రాస్తాపురం సురేష్ కుటుంబానికి బీర్ల అయిలయ్య మర్గదర్శకంలో కృష్ణరెడ్డి ఆదేశానుసారం గురువారం బండకొత్తపల్లి సర్పంచ్ గద్వాల ఉపేందర్ చేతుల మీదుగా ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు శంకరయ్య, చంద్రు, ఉషా ఉపేందర్, నర్సయ్య, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/త్రిపురారం :** ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు త్రిపురారం మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.పరీక్షలకు సంబంధించిన సెట్1, సెట్2 ప్రశ్నాపత్రాలను మండల విద్యాధికారి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు తుంగపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కంపసాగర్ మోడల్ స్కూల్,తుంగపాడు మోడల్ స్కూల్ విద్యార్థులు కలిపి మొత్తం 349 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు మండల విద్యాధికారి రవి నాయక్ తెలిపారు. పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడతాయని చెప్పారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన సూచించారు.

## ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం




**ప్రజాపక్షం/నకిరేకల్:** పదో తరగతి పరీక్షలు జీవితానికి తొలిమెట్టు అని, విద్యార్థులుప్రణాళికాబద్ధంగా చదివి విజయాన్ని సాధించాలని నకిరేకల్ మండల విద్యాధికారి మేక నాగయ్య అన్నారు.గురువారం తాటికల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు విద్యార్థులు ఏకాగ్రతతో,నిర్భయంగా ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు.వీడ్కోలు సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న,పాఠశాలఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి,లొట్లపల్లి కోటయ్య పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** క్రీడలతో మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్‌నాయక్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కొండమల్లేపల్లి ప్రిమియర్ లీగ్ సీజన్2 ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం సరదగా బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు. నేటి యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యాన్ని సాధించాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్‌దస్రునాయక్, వార్డు సభ్యులు ఊరే నరేష్, గంట మల్లేష్, ఎస్‌పిఎల్ క్రికెట్ టీం సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా డంప్ చేసిన ఇసుక స్వాధీనం

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలంలోని గోనబోయినపల్లి గ్రామంలో కొందరు ట్రాక్టర్ల యజమానులు తమ పొలాల్లో దుందుభి వాగు నుండి అక్రమంగా డంప్ చేసి ఇసుకను కొందరు నిలువ చేసి అధిక మొత్తంలో అమ్ముకుంటున్న విషయాన్ని నమ్మదగిన సమాచారం మేరకు గురువారం డిండి ఎస్ఐ బాలకృష్ణ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహా డంప్ చేసిన ప్రదేశానికి వెళ్లి పంచనామా నిర్వహించి, ఇసుక డంప్ మార్కింగ్ చేసి స్వాధీనపరుచుకున్నారు. ఇసుకను డంప్ చేసిరవాణా చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను, అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలుంటాయని అన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.





## బెల్ట్ షాప్‌పై పోలీసుల దాడి - కేసు నమోదు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని అజిలాపురం గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌పై మర్రిగూడ పోలీసులు గురువారం సోదాలు నిర్వహించారు.ఈసందర్భంగా అక్కడ నుంచి సుమారు 15 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం. కృష్ణారెడ్డి తెలిపారు.అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ రవి నాయక్ సహా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పశువులకు టీకాలు


**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బూరుబుబావి గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి డా. యాకుబ్ ప్రారంభించి సుమారు 185 పశువులకు టీకాలను వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తమ పశువులను సీజనల్ వ్యాధుల బారీన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని ఆయన సూచించారు. ఉప సర్పంచ్ బాలరాజు, పాల సెంటర్ చైర్మన్ బాలరాజు, విఏ రాజు, గోపాల మిత్రలు నరేష్, శ్రీను, చంద్రశేఖర్, సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన స్పీకర్

**ప్రజాపక్షం/తుంగతుర్తి** : రాష్ట్రంలో పార్టీ మారిన 10 మంది బిఆర్ఎస్ ఎంఎల్ఏలపై సుప్రీంకోర్టు ఆదేశంతో విచారణ చేపట్టిన అసెంబ్లీ స్పీకర్ అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని బిఆర్ఎస్ తుంగతుర్తి మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. బిఆర్ఎస్ కారు గుర్తుపై ఎంఎల్ఏగా గెలిచిన దానం నాగేందర్ హస్తం గుర్తుపై కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిన విషయం ప్రజల కండ్లముందు ఉన్నప్పటికి స్పీకర్ ప్రతిపక్ష సభ్యుల పిటిషన్‌ను తోసిపుచ్చుతూ పార్టీ ఫిరాయించిన సభ్యులంతా బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తీర్పు ఇవ్వడం చారిత్రాత్మక తప్పిదమన్నారు.

## మెకానిక్‌లకు అండగా ఉంటాం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : మెకానిక్‌లకు అండగా ఉంటామని సూర్యాపేట ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు రాందేని ఆదినారాయణ అన్నారు. సూర్యాపేట ట్రాక్టర్ మెకానిక్ ఆకుల రవి అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబానికి రూ.91వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పేద మెకానిక్ చనిపోయినను వారి కుటుంబానికి అసోసియేషన్ అండగా ఉంటుందని తెలిపారు. యూనియన్‌లో ఇలాంటి సంఘటనలు తోటి మెకానికుల మరణాలు జరిగినప్పుడు సభ్యులు అందరూ అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మృతుని భార్య ఆకుల నవభారతి, కుమారుడు సిద్ధు, కుమార్తె అక్షర, అసోసియేషన్ సభ్యులు కుంచారపు నాగిరెడ్డి, పలస మహేష్ గౌడ్, వాసంశెట్టి అనిల్ కుమార్, నిమ్మలకోటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీపరాభవ నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో బుధవారం మిర్యాలగూడ నియోజకవర్గ బ్రాహ్మణ పురోహిత, అర్చక సేవా సమైక్య ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం పంచాంగాన్ని ఆవిష్కరించారు. సంగం గౌరవ అధ్యక్షుడు పులి కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ మాట్లాడుతూ కొత్త తరం వారు పంచాంగ గణితం వైపు మక్కువ ప్రదర్శించాలన్నారు. గత తరం వారు పంచాంగాన్ని గుణించడం వల్ల ఇప్పటికీ మనం పాటిస్తున్నామని, కొత్తగా వస్తున్న యువతరం పంచాంగం, జ్యోతిష్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. కార్యక్రమంలో రాయప్రోలు మురళీ శర్మ, రాధాకృష్ణశర్మ, తయ్యాల ఫణికుమారచార్యులు, శ్రీనివాస్, సులూరి శివ సుబ్రహ్మణ్యశర్మ, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

## శిక్షణ తరగతుల్లో రసాభాస..

### ఎమ్మెల్యే కుంభంను నిలదీసిన బిఆర్ఎస్ సర్పంచులు



**ప్రజాపక్షం/భువనగిరి** : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక' శిక్షణ తరగతులు అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజా ప్రతినిధుల మధ్య వాగ్వాదంతో రసాభాసగా మారాయి. ఉపాధి హామీ (ఎంజిఎన్ఆర్ఈజిఎస్) పనుల కేటాయింపులో కేవలం కాంగ్రెస్ సర్పంచులు ఉన్న గ్రామాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ, తమ గ్రామాలను విస్మరిస్తున్నారని బిఆర్ఎస్ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారంటూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని నేరుగా నిలదీశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా 'డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేయడంతో హాల్లో ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకో వడంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. సర్పంచుల నిరసనలు, నినాదాల మధ్య శిక్షణ తరగతులు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడటంతో, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అసహనంతో సమావేశం మధ్యలోనే వెళ్ళిపోయారు. ప్రగతి ప్రణాళికపై అవగాహన కల్పించాల్సిన వేదిక కాస్తా రాజకీయ రణరంగంగా మారడంతో స్థానికంగా ఈ ఘటన చర్చనీయాంశమైంది.

## కామర్స్‌పై సమగ్ర అవగాహన ఉండాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** విద్యార్థులు కామర్స్‌లో అవగాహన పెంచుకుంటే విస్తృత అవకాశాలు వస్తాయని ఎన్‌జి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ సూచించారు.గురువారం పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కామర్స్‌పై సమగ్ర అవగాహన పెంపొందించుకుంటే విద్యార్థులకు విస్తృతమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. బుధవారం కళాశాలలో కామర్స్ విభాగం నిర్వహించచన థియరీ అండ్ ప్రాక్టీస్ అఫ్ జిఎస్‌టి పైన విస్తృత ఉపన్యాసం పై హైదరాబాద్‌కు చెందిన లీగల్ క్రాఫ్ట్ ఇండియా సంస్థ అడ్వకేట్ టాక్స్ ప్రాక్టిషనర్ జీ సిద్ధేశ్వరావు విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఈ ఎక్సటెన్షన్ లెక్చర్ కీలక పాత్ర పోషిస్తుందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు ప్రాక్టికల్ ట్రైనింగ్ అందించడంలో ఆ సంస్థ సహకారం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి జే.నాగరాజు,డాక్టర్ సాలయ్య,సిద్ధేశ్వరావు,వాసుదేవు,సావిత్రి,వహీద్ బాబా,వెంకటరెడ్డి,తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎంజియులో ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక కార్యక్రమం




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ 1,2ఆధ్వర్యంలో గురువారం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ విద్యార్థులు నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల చుట్టుపక్కల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం చెత్తను తొలగించి కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా మార్చారు.అదేవిధంగా కళాశాలలో తరగతులు గదులు డిపార్ట్మెంట్లలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించి క్లాస్ రూమ్ లను పరిశుభ్రంగా తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కె అరుణ ప్రియ, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ మహమ్మద్ షరీఫ్, మ్యాతరి ఆనంద్,వివిధ శాఖల అధ్యాపకులు ఆచార్య విశ్రీనివాస్,ఆచార్య విజయ బాబు, ఆచార్య మోహన్ రెడ్డి,డాక్టర్ పండరయ్య అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మనోధైర్యం అందించిన సర్పంచ్

**ప్రజాపక్షం/రామన్నపేట** : అకాల మరణం చెందిన గాజుల అంతమ్మ మృత దేహానికి ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గర్దాసు విక్రమ్ పూలమాలలు వేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేసి మనోధైర్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటపల్లి యాదయ్య, యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్, మందడి విధ్యాసాగర్ రెడ్డి, రాస వెంకటేశం, రాజన్నగారి రమేష్, జంగయ్య పాల్గొన్నారు.





## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**ప్రజాపక్షం/త్రిపురారం:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మసీదు వద్ద టీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రంజాన్ మాసం శాంతి, సహనం, పరస్పర సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉండాలని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, నగిరి వెంకన్న, యాదయ్య, శివ, దస్తగిరి, షరీఫ్, జావేద్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



**ప్రజాపక్షం/బీబీనగర్** : మండలంలోని ఎంపీపీఎస్ చిన్న రావులపల్లిలో గురువారం స్వపరిపాలనా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, రాజకీయ నాయకులుగా అలరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కె.జోసెఫ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్న రావులపల్లి ప్రధానోపాధ్యాయులు వాసు రెడ్డి పాల్గొని పిల్లలు నిజ జీవితంలో అధికారులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటా చారి, పాఠశాల చైర్మన్ మీసాల సుజాత, ఉపాధ్యాయులు అరుణ విద్యార్థుల తల్లిదండ్రులు అండాలమ్మ, సరిత, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గపురి వాహనం మరమ్మతులు పూర్తి



**ప్రజాపక్షం/రామన్నపేట** : ఈర్లపల్లి (శివగల్ల)నర్సింహా జ్ఞాపకార్ధం వారి కుమారుడు శివగల్ల శ్రీనివాస్ రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరానికి గత 7 సంవత్సరాల క్రితం అందజేసిన స్వర్గపురిరథం గత రెండు సంవత్సరాల నుండి శిథిలావస్థకు చేరుకోగా గ్రామ ప్రజల సౌకర్యార్థం గ్రామ సర్పంచ్ గర్ధాస్ విక్రమ్, ధాత శ్రీనివాస్ చొరవ తీసుకొని సుమారు రూ.1 లక్ష 20 వేలతో రిపేర్ చేయించి మళ్ళీ వినియోగంలోకి తీసుకురావడం జరిగింది. కావున గ్రామ మరియు పరిసరప్రాంత గ్రామ ప్రజలు నిర్వహణ ఖర్చులు చెల్లించి వినియోగించుకోవాలని అన్నారు.

## నూతన వధూవరులకు ఉజ్జిని ఆశీర్వాదం

**ప్రజాపక్షం/చింతపల్లి** : మండల పరిధిలోని వింజమూరు గ్రామానికి చెందిన సీత యాదయ్య పార్వతమ్మల దంపతుల కుమారుడు జగన్, ఘడియగౌరారం గ్రామానికి చెందిన శివర్ల వెంకటయ్య యశోధల కుమార్తె ఇందు వివాహం మండల పరిధిలోని మొగుతాలయాదయ్య గార్డెన్‌లో గురువారం జరిగింది. ఈ వివాహానికి మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరావు, ఘడియగౌరారం గ్రామ సర్పంచ్ ఉజ్జిని హేమలత నరెందర్‌రావు హాజరయి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి, ఉజ్జిని అంజల్‌రావ్, చెల్లం పాండురంగారావ్, కాంగ్రెస్ నాయకులు సంతోష్‌రావ్, తూళ్ళ రమేష్, జంగయ్య పాల్గొన్నారు.





## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్ క్యాంపు

**ప్రజాపక్షం/గుండాల;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం గుండాల మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ స్పెషలిస్ట్ క్యాంపులో స్త్రీ వైద్య నిపుణులు డా. తేజ శ్రీవేణి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డా. సంతోష్ పెద్ది, ఎముకల వైద్య నిపుణులు డా. శ్రీజ, దంత వైద్య నిపుణులు డా. ప్రసన్న లక్ష్మీ , జనరల్ ఫిజిషియన్ డా. కీర్తనల ఆధ్వర్యంలో మండల ప్రజలకు చికిత్సలు నిర్వహించారు. 180 మంది ఈ స్పెషలిస్ట్ క్యాంపు ద్వారా పరీక్షలు నిర్వహించుకున్నారని మండల వైద్యాధికారి డా. ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## మాజీ ముఖ్యమంత్రిని కలిసిన జైపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** బీబీనగర్ మండల మాజీ రైతు కోఆర్డినేటర్ బొక్క జైపాల్ రెడ్డి తెలంగాణ రథసారథి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును ఆయన నివాస గృహంలో గురువారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ రాబోవు రోజులు మనవేనని ధైర్యంగా ప్రజల్లో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. అదేవిధంగా మాజీ మంత్రులను కల్వకుంట్ల తారక రామారావును హరేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

## యూనియన్ సహాయం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన యేషబోయిన అంజమ్మ కుటుంబ కుటుంబానికి శ్రీ పలుగులమైసమ్మ సిఐటియు పెయింటర్ యూనియన్ తరపున 50 కేజీల బియ్యం, గణపతి పెయింట్ షాప్ వినీత్ తరుపున 5 కేజీల మంచి నూనె వారికి సహాయంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు మేడిపల్లి రాజు, ఉపాధ్యక్షులు సంతోష్ కుమార్ గౌడ్, జనరల్ సెక్రెటరీ శ్రీశైలం, రాజు, సత్యనారాయణ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వమత సమ్మేళనమే భారతీయత

**ప్రజాపక్షం/కోదాడ:** సర్వమత సమ్మేళనమే భారతీయత అని కోదాడ పట్టణ యువజన నాయకులు కుదుముల సాయిపవన్ పేర్కొన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని 33వ వార్డులో రంజాన్ మాస సందర్భంగా ముస్లీం సోదరులకు ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె నయీం, ఆరీఫ్, జాని, నవీన్, పండు పాల్గొన్నారు.



# తాటిబెల్లం టీ స్టాల్ ప్రారంభం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని, మాదాపూర్ గ్రామంలో బీఆర్ నాయకులు సిద్ధెంకి మహేష్ నూతనంగా ఏర్పాటు చేసిన తాటి బెల్లం టీ స్టాల్, కాఫీ షాప్ మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ప్రారంబించారు. తాటి బెల్లం ఆరోగ్యానికి, రుచిలో మంచిదని అన్నారు. అనంతరం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ తుర్కపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు తేజస్వి నిఖిల్, నాయకులు శాగర్ల పరమేష్ యాదవ్, హరినాయక్, రహమత్ షరీఫ్, బాలక్రిష్ణ, సురేష్ నాయక్, శ్రీకాంత్, గ్రామ పంచాయితీ ఉపసర్పంచ్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి



**ప్రజాపక్షం/వేములపల్లి:** ఉపాధి కూలీల శ్రమను దోపిడీ చేస్తున్న విబిజి రాంజీ బిల్లు రద్దు చేసి గతంలో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలనీ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్న వెంకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్. చేశారు.గురువారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ వారం వారం వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్న గత నాలుగు వారాలుగా పని చేస్తున్న కార్మికులకు వేతనాలు అందలేదని అన్నారు.సంవత్సరానికి 125 రోజులు పని కల్పిస్తున్నామని ప్రజల్ని మోసం చేస్తుందన్నరూ రాంజీ చట్టాన్ని రద్దు చేసే వరకు కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారీ ఐలయ్య సహాయ కార్యదర్శి సుకన్య, శెట్టిపాలెం గ్రామ అధ్యక్షురాలు బంటు లావణ్య,కార్యదర్శి నక్క భవాని, ఉపాధ్యక్షులు బంటు నీలమ్మ సహయ కార్యదర్శి సైదమ్మ పాల్గొన్నారు.

# జడ్‌పి సిఇఒ ప్రేమకరణ్ రెడ్డికి శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** జిల్లా పరిషత్ నూతన ముఖ్యకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన నంద్యాల ప్రేమకరణ్ రెడ్డిని ఆయన కార్యాలయంలో పలువురు సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి సంఘం జిల్లా అధ్యక్షుడు చింతమల్ల చలపతి, పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు,జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది నాల్గవ తరగతి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కన్షియన్స్ -2026లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సాయుధ మహిళ డిగ్రీ కళాశాల దేశ్ముఖిలో జరుగుతున్న కాన్షియన్స్ 2026 రెండవ రోజు గురువారం నిర్వహించిన వివిధ సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు అందరినీ అలరించాయి. క్రీడల విభాగంలో 100 మీ, 200 మీ, 400 మీ పరుగు పందాలు, షాట్ పుట్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, కబడ్డీ, క్యారం, చెస్ పోటీలను నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో సాంసృతిక విభాగం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు, మిస్ ఆర్డీసీ పోటీలలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డాన్స్ న్యాయ నిర్ణేతగా విశిష్ట అతిథి కొరియోగ్రాఫర్ డైరెక్టర్ శ్రీమతి సుచిత్ర చంద్రబోస్ పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. సుచిత్ర చంద్రబోస్ మాట్లాడుతూ ప్రతి మహిళ తన జీవిత ప్రయాణంలో ఒడిదుడుకులను తట్టుకొని ధైర్యంగా, ఏకాగ్రతతో ఒక శక్తి వలె ముందుకు సాగుతూ రాణించాలని తెలియజేశారు. ఫ్లెక్స్ వాక్ మిస్ ఆర్ డిసి, లిఫ్ట్, యువ కవి సమ్మేళనం పోటీలను నిర్వహించి ముఖ్య అతిథులు సినీగీ రచయిత అనంత శ్రీరామ్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత గడ్డం మోహన్ రావులు బహుమతులు అందజేశారు. సినీనటి బుల్లితెర యాంకర్ ఇన్ఫ్లుయెన్సర్ కుమారి రష్మీ గౌతమ్ న్యాయ నిర్ణీతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ విద్యాలయాల అధికారులు జాయింట్ సెక్రటరీ పిఎస్ఆర్ శర్మ, మల్టీ జోనల్ ఆఫీసర్ శ్రీమతి రజిని, స్టేట్ ఆఫీసర్ నిర్మల, జోనల్ ఆఫీసర్ విద్యా విద్యాంజలి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే శ్రీలత, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఐ రమా దేవి, అధ్యాపక, అధ్యాపకేతర బృందాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం

**ప్రజాపక్షం/నాంపల్లి:** పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమాన్ని గురువారం నాంపల్లి మండలంలోని గానుగుపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పశువులకు వైద్య సిబ్బంది టీకాలు వేశారు. మొత్తం 162 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందజేశారు.అదే సమయంలో పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఆకులపల్లి పర్వతాలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ వెంకన్న,గోపాలమిత్ర సూపర్‌వైజర్ ప్రసాద్,మైత్రి సిబ్బంది మహేష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన గంగాపురం యాదయ్య గౌడ్ కుమారుడి వివాహానికి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన వరికుప్పల రమేష్ కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను దీవించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సహకారంతో గ్రామాలు అభివృద్ధి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని సర్పంచ్ బత్తిని అంజయ్య అన్నారు. గురువారం మండలంలోని మంగాపురం గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధుల నుండి వచ్చిన ఐదు లక్షల రూపాయల నిధులతో సీసీరోడ్డు పనులకు ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధ్యే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కారింగుల కృష్ణమూర్తి, మాజీ ఎంపిటిసి బాల్‌దూరి సందీప్, ఉప సర్పంచ్ ధరావత్ భాష, బూర రేఖ, బత్తిని చిన్న మల్లయ్య, నాగరాజు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు ఎంఇఒ పర్యవేక్షణ

**ప్రజాపక్షం/మర్రిగూడ:** పదో తరగతి వార్షిక పరీక్షలను అధికారులు క్రమబద్ధంగా నిర్వహిస్తునట్లు ఎంఈఓ శారద తెలిపారు. పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.మండల వ్యాప్తంగా సుమారు 300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సిసి టివి పర్యవేక్షణ,రూప్ సింగ్,నగేశ్వర్ రావు,డిపార్ట్‌మెంట్ అధికారులలు హైమవతి, సురేందర్ తో కలిసి పర్యవేక్షణ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

# సత్యనారాయణకు శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కవ్వంపల్లి సత్యనారాయణను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తో కలసి ఎమ్మెల్యే వేములవీరేశంమర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ఆయన సమర్థవంతంగా పని చేయాలని ఆకాంక్షించారు. ఎస్‌సి వర్గాల అభ్యున్నతికి ఆయన నాయకత్వంలోమరిన్నిసంక్షేమకార్యక్రమాలు అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

